
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 365 | సోమవారం, 01 సెప్టెంబర్ 2025 | పేజీలు: 05 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

## సెప్టెంబర్ 10 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్

- రెండు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధత
- బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లు అసెంబ్లీలో చర్చలో
- ఓటర్ల జాబితా విడుదలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు
- హైకోర్టు ఆదేశాల మధ్య గ్రామీణాభివృద్ధి నిధుల కోసం కీలకమైన ఎన్నికలు

02




## ఎమ్మెల్యేగా పోటీకి 21 ఏళ్లు చాలు


- 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి
- బీజేపీ యువత హక్కులను కాలరాస్తోంది
- ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి
- కేరళలో ఎంపీ మెరిట్ అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

02

# ఆరునూరైనా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

## బలహీన వర్గాలకు న్యాయం చేస్తాం

- బీఆర్ఎస్ తెచ్చిన చట్టాలే గుదిబండగా మారాయ్
- గవర్నర్, మాజీ సీఎ సాన్నిహిత్యంతోనే బిల్లులు ఆగాయి
- దమ్ముంటే కేసీఆర్‌ను అసెంబ్లీకి రమ్మని చెప్పండి
- సభకు వచ్చి సలహాలు ఇస్తే పెద్దరికం నిలిచేది కదా
- కల్వకుంట్ల కాదు.. కల్వకుంట ఫ్యామిలీ
- ఎవరినీ కలవనీయకుండా చూసే కుటుంబం అది
- మున్సిపల్ చట్ట సవరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్ రెడ్డి






**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. బీసీలకు రీజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్రలో రాహుల్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నాం.. ఇతర రాష్ట్రాల్లో వచ్చిన అడ్డంకులు తెలంగాణలో రావొద్దన్నదే మా ఆలోచన.. ఆరునూరైనా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించాం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు చేసి పంపితే గవర్నర్, రాష్ట్రపతి పెండింగ్ లో పెట్టారు.. గత సర్కార్ 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దంటూ చట్టం తెచ్చింది.. తెలంగాణ ప్రజల్లో అపోహలు సృష్టించే విధంగా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలు గుదిబండగా మారాయి.. ఈ అడ్డంకిని తొలగించాలని ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ కు పంపించాం.. తెర వెనుక లాబీయింగ్ చేసి బిల్లును రాష్ట్రపతికి పంపించేలా చేశారు.. బీసీ రిజర్వేషన్లపై గంగుల ఒక్కడే సంతోషంగా ఉన్నారు.. బీసీ రిజర్వేషన్లపై కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ..మిగతా 2లో



# విద్యతోనే బడుగు బలహీనవర్గాల అభివృద్ధి

- వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- వికారాబాద్ జిల్లా గురుకుల హాస్టల్ భవనం ప్రారంభోత్సవం

**వికారాబాద్, ప్రజాస్వరం :**

వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జీనుగుర్తి గ్రామంలో ఏకలవ్య గ్రామీణ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అది వారం ఏర్పాటు చేసిన సందీపని గురుకులం ఆవరణలో హాస్టల్ భవనము ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్ గుర్తి గ్రామంలో ఉన్న ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సందీపని గురుకులం నూతన భవన ప్రారంభానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో

# కాళేశ్వరం నిర్మాణంలో తీవ్ర లోపాలు

- అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ
- డ్యామ్, బ్యారేజీకి తేడా లేకుండా కట్టడం వల్లే మేడిగడ్డ కుంగిపోయింది
- రూ.1.47 లక్షల కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు కూడా నీరందలేదు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో వివరాలు వెల్లడి
- తక్కువ ఖర్చుతో అయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టారు
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో డ్యామ్‌కు, బ్యారేజీకి మధ్య తేడా పాటించకుండా ఘోరమైన తప్పిదాలకు పాల్పడ్డారని, దాని పర్యవసానమే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ..మిగతా 2లో


# కాళేశ్వరంపై రగడ



- కాళేశ్వరం నివేదికపై చర్చలో తీవ్ర గందరగోళం
- జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసిన బీఆర్ఎస్
- మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ సభ నుంచి వాకౌట్
- బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్
- నివేదిక ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ శాసనసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగిన చర్చ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. కాళేశ్వరం నివేదికపై చర్చ జరుగుతున్న సమయంలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. స్పీకర్ మైక్ ఇవ్వకపోవడంతో గంటన్నర పాటు వేచి చూశామని, అయినా అవకాశం రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొందరు సభ్యులు ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. సభ లాబీల్లో భారీ సంఖ్యలో మార్షల్స్‌ను ..మిగతా 2లో



## సిరిసిల్ల వరద బాధితులకు రూ.10 లక్షల సాయం

- ఆ సాయాన్ని కలెక్టర్‌కు అందజేయనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్
- బీజేపీ స్టేట్ చీఫ్ రామచంద్రరావు పిలుపు మేరకు ఎంపీ లాడ్స్ నిధుల కేటాయింపు



02



## ఢిల్లీలోని నిరాహార దీక్ష చేపట్టండి

- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం పోరాడాలి
- బీసీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- బీసీ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్

02

# పీసీ ఘోష్ నివేదిక ఓ డొల్ల రిపోర్ట్

- ఈ నివేదిక న్యాయస్థానంలో నిలబడదని
- 660 పేజీల నివేదికపై చర్చించేందుకు అరగంట సమయమా?
- ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేసే కుట్ర ఇది
- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్



**తెలంగాణ బ్యూరో, ప్రజా స్వరం :**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక రాజకీయ ప్రేరేపితమని, అదో డొల్ల రిపోర్ట్ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ నివేదిక న్యాయస్థానంలో నిలబడదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 660 పేజీల నివేదికపై చర్చించేందుకు కేవలం అరగంట సమయం ఇవ్వడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఇంత పెద్ద నివేదికపై అర గంటలో ఏం మాట్లాడగలం? ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేసే కుట్ర ఇది" అని ఆయన అన్నారు. ఇంత కీలకమైన అంశంపై మాట్లాడేందుకు కనీసం రెండు గంటల సమయం ఇవ్వాలని, ఎలాంటి అంతరాయం కలిగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే రాబోయే రెండు రోజులు కూడా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ..మిగతా 2లో

# ఢిల్లీలోని నిరాహార దీక్ష చేపట్టండి

- **42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం పోరాడాలి**
- **బీసీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
- **బీసీ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత కేటీఆర్ సవాల్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ కీలక సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు కేంద్రం ఆమోదం పొందేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం శాసనసభలో పంచాయతీ రాజ్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. "ప్రధానికి ఐదు సార్లు లేఖ రాశానని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అపాయింట్‌మెంట్లు అడగడం కాదు, చిత్తశుద్ధిని చాటుకోవాలి. నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే, రేవంత్ రెడ్డి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ బిల్లు పాసయ్యే వరకు నిరవధిక నిరాహార దీక్షకు దిగాలి" అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఢిల్లీ వెళ్లి, లక్ష్యం నెరవేరే వరకు తిరిగి రానని ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. "అదే తరహా పట్టుదలను రేవంత్ రెడ్డి కూడా ప్రదర్శించాలి. బీసీ బిల్లు సాధించే వరకు ఢిల్లీలోనే ఉండాలి" అని అన్నారు. 2004లోనే దేశంలో తొలిసారిగా ప్రత్యేక ఓబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కులగణన, చట్టసభల్లో ఓబీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపామని వివరించారు. బీసీ రిజర్వేషన్లపై ఐదుసార్లు మాట మార్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఎలా నమ్ముతారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ తీసుకురావాలని డిమాండ్ చేశారు. "42 శాతం బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌కు మేము పూర్తిగా మద్దతు ఇస్తున్నాం. కానీ చట్టాలు లొసుగులు లేకుండా ఉండాలి. లేదంటే న్యాయ సమీక్షలో అవి నిలబడవు. కేవలం ప్రకటనలు కాదు, నిబద్ధత ముఖ్యం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఆరునూరైనా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

మొదటిపేజీ తరువాయి



దుఃఖంతో ఉన్నారు.. బీసీ రిజర్వేషన్లపై హరీష్ రావు, కేటీఆర్ కడుపు నిండా విషం పెట్టుకుని ఉన్నారు.. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి మేము జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేశాం.. కానీ బీఆర్ఎస్ మాత్రం మద్దతు తెలపలేదు.. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి బీఆర్ఎస్ కు లేదు.. మేము సహకరించం, మా బుద్ధి మారదు అంటే.. ప్రజలే సమాధానం చెప్తారు.. మీరు మాకు సూక్తులు చెప్పాల్సిన అవసరం లేదు.. ముందు మీ నాయకుడిని సభకు రమ్మనండి.. కేసీఆర్ సభకు రాడు.. వచ్చిన వాళ్లు ఇలా ఉన్నారు.. కల్వకుంట్ల కాదు.. కలవకుండా చేసే కుటుంబం.. తెరవెనుక లాబీయింగ్ చేసి బిల్లును రాష్ట్రపతికి పంపించేలా చేశారు.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుని పలుచన కావొద్దు.. పొన్నంను అవమానిస్తే నీకేం రాదు.. అలా మాట్లాడితే మీరే చులకన అవుతారు అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.


# కాళేశ్వరంపై రగడ

మొదటిపేజీ తరువాయి

మోహరించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా వారు తమ నిరసనను కొనసాగించారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభలో కాగితాలు చించి వేయడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. కాళేశ్వరం నివేదికలోని వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఇలా ప్రవర్తిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష సభ్యులు సభా నియమాలను గౌరవించాలని ఆయన సూచించారు.

# కాళేశ్వరం నిర్మాణంలో తీవ్ర లోపాలు

మొదటిపేజీ తరువాయి



ఈ సంచలన విషయాలను వెల్లడించారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన నివేదికలోని అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాల వల్ల మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు గత 20 నెలలుగా పూర్తిగా నిరుపయోగంగా మారాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.87,449 కోట్లతో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం, చివరికి రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని విమర్శించారు. ఇంత భారీగా ఖర్చు చేసినప్పటికీ, కనీసం లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందించలేకపోయారని ఆయన అన్నారు. వాస్తవానికి, వ్యాప్కోస్ నిపుణుల సూచన మేరకు ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును కేవలం రూ.38 వేల కోట్లతో పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం దాన్ని పక్కనపెట్టిందని ఉత్తమ్ గుర్తుచేశారు. 2019 నుంచి 2023 మధ్య కాలంలో కాళేశ్వరం నుంచి కేవలం 162 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేశారని, అంటే సగటున ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే వినియోగించారని గణాంకాలతో సహా వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం ఒక పెను విపత్తు అని మంత్రి అభివర్ణించారు. ఈ దుస్థితికి కారణమైన బీఆర్ఎస్ పార్టీ, ఇప్పుడు ఎన్‌డీఎస్ఏ నివేదికను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గతంలో ఇదే బిల్లుకు ఆ పార్టీ మద్దతు తెలిపిందన్న విషయాన్ని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు.






# విద్యతోనే బడుగు బలహీనవర్గాల అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి





ఏర్పాటు చేసిన సభలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, విద్యతోనే సమాజం బడుగు బలహీనవర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. విద్యాపరంగా వికారాబాద్ జిల్లా వృద్ధిలో వెనుకబడి ఉందని అన్నారు.దేశం అభివృద్ధి చెందాలంటే దేశ వ్యవస్థ ఇతరులపై ఆధారపడకుండా దేశంలోనే సమృద్ధి అయ్యేలా స్వరాజ్యం ఏర్పాటు చేసుకోవాలని అప్పుడే మన పరిపాలనలో మనం అభివృద్ధి చెందగలుగుతామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. దేశంలో ఎటువంటి మార్పుకైనా గ్రామీణ ప్రాంతాల నుంచి ఉద్యమం ఉండాలన్నారు. మన దేశం స్వరజ్య దేశంగా ఎదగాలని, ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలవాలంటే అందుకు ఏకలవ్య గురుకులాల ద్వారానే సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. రాబోయే 100 సంవత్సరాల దేశ స్వరాజ్యంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయ ఉత్సవాలు నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. పాఠశాలల్లో యోగాను అమలు చేయాలని, దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించవచ్చని మంత్రి తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనసుపెట్టి పనిచేస్తే ఏదైనా సాధ్యం అవుతుందన్నారు. సమాజ మార్పులో భాగంగా ఎన్నో సంస్కరణలు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమాజ మార్పులో భాగంగా మారుమూల ప్రాంతాల్లో గురుకులాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యను వ్యాపార సంస్థలు గా కాకుండా జ్ఞానాన్ని పెంపొందించే దిశగా ఉండాలని. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలను పూర్వవైభవానికి తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకుగాను ఉద్యోగ భరోసా నిమిత్తం ఏటీసీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కులాలకు అతీతంగా విద్యను అభ్యసించాలన్న సదుద్దేశంతో 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని అదేవిధంగా ప్రజలకు నాణ్యమైన జానీ అందించేందుకు పెద్ద మొత్తంలో ఆసుపత్రులను నిర్మించేందుకు అధిక నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ముందుగా సందీపని గురుకుల ఆవరణలో మంత్రి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో, విశ్రాంత ఐఏఎస్ అధికారి, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్(జమ్మూ అండ్ కాశ్మీర్) సతీష్ చంద్ర , జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య, చైర్మన్ పి. వెంకటేశ్వరరావు, సందీపని గురుకులం చైర్మన్ మల్లారెడ్డి, ఎస్బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన ప్రొఫెసర్స్, డాక్టర్లు లు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్

- **రెండు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధత**
- **బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లు అసెంబ్లీలో చర్చలో**
- **ఓటర్ల జాబితా విడుదలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు**
- **హైకోర్టు ఆదేశాల మధ్య గ్రామీణాభివృద్ధి నిధుల కోసం కీలకమైన ఎన్నికలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణలో చాలా కాలంగా వాయిదా పడుతున్న స్థానిక సంస్థల ఎన్నికలకు చివరకు పచ్చజెండా ఊగబోతున్నట్లు కనిపిస్తోంది. వచ్చే వారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే దిశగా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తేల్చి చెప్పారు. సెప్టెంబర్ 10 తర్వాత ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వివరాల ప్రకారం, స్థానిక సంస్థల ఎన్నికలు రెండు విడతల్లో జరిగే అవకాశముంది. తొలి దశలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత రెండో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు కావాల్సిన సన్నాహాలు ఎన్నికల సంఘం వేగవంతం చేసింది. ప్రస్తుతం అసెంబ్లీలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల బిల్లుపై చర్చ కొనసాగుతోంది. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అసెంబ్లీలో ఆమోదం తర్వాత మండలిలో కూడా ఆ బిల్లుపై చర్చ జరగనుంది. ఆ తర్వాతే ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఈ రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి వారం రోజుల సమయం కోరింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ దిశగా అడుగులు వేస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 10లోపు విడుదల చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. సెప్టెంబర్ 4 లేదా 5న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం 6 లేదా 7న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై అభ్యంతరాలను స్వీకరిస్తారు. పరిశీలనల అనంతరం 8 లేదా 9న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. దీంతో సెప్టెంబర్ 10నాటికి ఎన్నికల ప్రక్రియ ఘనంగా ప్రారంభమవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాదిన్నరగా రాష్ట్రంలో పాలక మండళ్లు లేకపోవడంతో గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోయాయి. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులు విడుదల కాకపోవడంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయి. ఈ నిధులను తిరిగి పొందేందుకు కూడా ఎన్నికలు కీలకమని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో తెలంగాణ హైకోర్టు కూడా సెప్టెంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# సిరిసిల్ల వరద బాధితులకు రూ.10 లక్షల సాయం

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

అకాల వర్షాలు, వరదలతో నష్టపోయిన జిల్లాల ప్రజలను ఆదుకోవాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. అకాల వర్షాలతో నష్టపోయిన సిరిసిల్ల జిల్లా ప్రజలను ఆదుకునేందుకు రూ.10 లక్షల రూపాయలను అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఈ మొత్తాన్ని సంబంధిత సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు త్వరలోనే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అకాల వర్షాలతో సిరిసిల్ల జిల్లాలో భారీ ఎత్తున నష్టం సంభవించిందన్నారు. రైతులకు పెద్ద ఎత్తున పంట నష్టం సంభవించిందని, పలువురు నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపీ లాడ్స్ నిధుల మొత్తాన్ని సిరిసిల్ల జిల్లా బాధితులను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేగా పోటీకి 21 ఏళ్లు చాలు

- **2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి**
- **కేరళలో ఎంపీ మెరిట్ అవార్డుల కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

దేశంలో ప్రతి ఒక్కరి ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 2029లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు యువత సంకల్పం తీసుకోవాలని ఆయన కోరారు. ఆదివారం కేరళలోని అలప్పుజలో కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నిర్వహించిన 'ఎంపీ మెరిట్ అవార్డ్స్2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కీలక డిమాండ్ చేశారు. "21 ఏళ్లకే ఐఏఎస్ అధికారులు జిల్లాలను సమర్థంగా పరిపాలిస్తున్నప్పుడు, అదే వయసున్న యువకులు ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదు?" అని ప్రశ్నించారు. దీని కోసం రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేశారు. 2026లో జరగబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికలు, 2029లో దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి డబ్బు, అధికారం, మీడియా మద్దతు లేకపోయినా.. ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తెలంగాణ నుంచి పోటీ చేయమని ఆహ్వానించామని, కానీ వారు కేరళను తమ కర్మభూమిగా ఎంచుకున్నారని చెప్పారు. బీజేపీ యువత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. "దేశంలో మార్పు తీసుకురాగల శక్తి యువతకు ఉంది. యువతే మా బ్రాండ్ అంబాసిడర్లు. వారి భవిష్యత్తు కోసం వారు చేసే పోరాటం కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పెద్ద ఉద్యమం నడుస్తోందని, అందులో అందరూ చేరాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధి నమూనా గురించి మాట్లాడుతూ, 'తెలంగాణ రైజింగ్2047' లక్ష్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. రాష్ట్రంలో కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, 100 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

# పీసీ ఘోష్ నివేదిక ఓ డొల్ల రిపోర్ట్

మొదటిపేజీ తరువాయి



విచారణ నిష్పాక్షికంగా సాగలేదని హరీశ్‌రావు ఆరోపించారు. విచారణ కమిషన్ల చట్టంలోని సెక్షన్ 8బి, 8సి ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, కమిషన్ ఆ నిబంధన పాటించలేదని గుర్తుచేశారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ, ఈ నివేదిక చట్టబద్ధంగా చెల్లదని పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ కుట్రలో భాగమేనని, తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుని ఇప్పటికే ఈ నివేదికను రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. ఆరోపణలు చేసి, మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం సరికాదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు.

**ఈ నివేదిక చట్టబద్ధం కాదు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక చట్టబద్ధం కాదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విచారణ కమిషన్ల చట్టం, 1952లోని సెక్షన్ 8బీ ప్రకారం తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, తమ వాదన వినే అవకాశం కల్పించకుండా ఏకపక్షంగా నివేదిక రూపొందించారని ఆయన ఆరోపించారు. ఈ ప్రక్రియ రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని, ఈ నివేదిక చెత్త కాగితంతో సమానమని ఆయన అభివర్ణించారు. విచారణ కమిషన్ తన నివేదికలో ఎవరిపైనైనా ఆరోపణలు చేయాలనుకుంటే, ముందుగా వారికి సెక్షన్ 8బీ కింద నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకోవడంతో పాటు, క్రాస్ ఎగ్జామినేషన్ చేసుకునే అవకాశం కల్పించాలన్నది చట్టంలోని కీలక నిబంధన అని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ, జస్టిస్ ఘోష్ కమిటీ ఈ ప్రాథమిక సూత్రాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గానీ, తనకు గానీ, విచారణకు పిలిచిన ఇతర నేతలు, అధికారులకు గానీ ఈ నోటీసులు ఇవ్వలేదని, అందువల్ల ఈ విచారణ నిష్పక్షపాతంగా జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

**ఇది రాజకీయ ప్రేరేపితమే!**

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచే కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి భూసేకరణను అడ్డుకున్నారని అన్నారు. అధికారంలోకి వస్తే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలోనే పెట్టారని, ఇప్పుడు ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసి రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విచారణ కమిషన్లను రాజకీయ అస్త్రంగా వాడుకోవద్దని 1958లోనే సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు.



# ప్రధాని తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్
- రాహుల్ గాంధీ చిత్రపటం దహనం



**మెదక్, ఆగస్టు 31 (ప్రజా స్వరం) :** నరేంద్ర మోడీ తల్లి పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరసనగా మెదక్ పట్టణ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ తల్లి పైన అనుచిత వ్యాఖ్యలు సరికాదని అన్నారు. మోడీ చేసిన సంక్షేమ పథకాల పట్ల దేశ ప్రజలు అందరూ కూడా సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. అలాంటి వ్యక్తి తల్లి పైన రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దారుణమని తను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగక్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, బాదె బాలరాజు, జిల్లా ఎస్టి మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, మెదక్ జిల్లా సీనియర్ నాయకులు నల్లాల విజయ్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, ఓబీసీ మోర్చా నాయకులు బక్కవారి శివ, అల్లం మధు అంకం శ్రీనివాస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు బబ్లు, రాహుల్, సాయి, రాజ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల, బాలికల భద్రతకే షీ టీమ్స్

- మౌనం వీడి – నిర్భయంగా ముందుకు రండి, వేధింపుల నుండి బయటపడండి
- ఫిర్యాదు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి
- జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు

**మెదక్, ఆగస్టు 31 (ప్రజా స్వరం) :** ఆగస్టు నెలలో షీ టీమ్స్ చేపట్టిన చర్యల్లో భాగంగా మెదక్ డివిజన్ లో ఇవ్‌టీజర్స్ పై 02 ఎఫ్ఐఆర్లు, 14 ఈ పెట్టీ కేసులు, తూప్రాన్ డివిజన్ లో 04 ఈ పెట్టీ కేసులు నమోదు అయ్యాయని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 02 ఎఫ్ఐఆర్లు లు 18 కేసులు నమోదయ్యాయన్నారు. అలాగే రెడ్ హ్యాండ్‌గా పట్టుబడిన 73 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో 47 అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. రోడ్ల పై వేధింపులు, అవమానకరమైన మాటలు, వెంబడించడం వంటి ఘటనల్లో వెంటనే 100 నెంబర్కు లేదా షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 8712657963కు సమాచారం అందించాలని సూచించారు. ఫోన్ చేసిన వారి పేరు, నెంబర్ గోప్యంగా ఉంచబడుతుందని, సివిల్ డ్రెస్‌లో పోలీసులు కూడళ్ల వద్ద గస్తీ నిర్వహిస్తారని తెలిపారు. అదే విధంగా 18 ఏళ్లు నిండక ముందే వివాహం జరుగుతున్నట్లయితే 1098 నెంబర్ కు తెలియజేయాలని అన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ద్వారా




అక్రమ రవాణా, ఆర్గనైజ్డ్ క్రైమ్‌లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో షీ టీమ్స్ సిబ్బంది – ఏఎస్ఐ వెంకటయ్య, హెచ్ సి లు శ్రీనివాస్, శంకరయ్య, కానిస్టేబుళ్లు ప్రమీల, విజయ్, స్వరూప, గంగామణి, హెచ్జీ రవి తమ తమ డివిజన్ ల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

# గుమ్మడిదలలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**గుమ్మడిదల, ఆగస్టు 31 (ప్రజాస్వరం) :** మండల కేంద్రంలో భాజాప మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం మరియు మన్ -కి- బాత్ 125వ భాగం కార్యక్రమాన్ని రామ్ రెడ్డి బాయ్ గ్రామంలో ఆదివారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోవర్ధన్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు అంజిరెడ్డి పాల్గొని యొక్క సమావేశాన్ని ప్రారంభించారు.మండల అధ్యక్షులు కావలి ఐలేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు అంశాలు పరిగణములోకి తీసుకొని ఎజెండా అంశాలను తీర్మానించడం జరిగింది! ఈ కార్యక్రమంలో మండల పదాధికారి కోఆర్డినేటర్ సరిగారి వీరారెడ్డి, కార్యవర్గ సభ్యులు ముత్యాల గౌడ్, వెంకట్రాం రెడ్డి, అమ్మగారి అనిల్ రెడ్డి,గంగ గౌడ్, పదాధికారుల నాయకులు సింగరి రాజన్న, భూత్ అధ్యక్షులు, భాగయ్య జనార్దన్ రెడ్డి, సమల మహేందర్ రెడ్డి, బొల్లారం అంజిరెడ్డి, శ్రావణ్ గౌడ్,ఆర్.ఎస్.ఎస్ వ క్త, ప్రముఖులు పార్టీ కార్యకర్తలు తదిర్లు పాల్గొన్నారు.

# వైభవంగా వినాయక నిమజ్జనం

- **వికారాబాద్ జిల్లా తాండూరులో ఐదు రోజులపాటు ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను కాగ్న వాగులో నిమజ్జనం**
- **హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిమజ్జన ఏర్పాట్లు**
- **పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఇతర నాయకులు**



**తాండూరు, ఆగస్టు 31(ప్రజా స్వరం):**


వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఐదు రోజులపాటు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఆదివారం అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించి సమీపంలోని కాగ్న వాగుల్లో నిమజ్జనం చేశారు. స్థానిక హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. మున్సిపల్, రెవిన్యూ, ఇరిగేషన్, రోడ్లు భవనాల శాఖ, పోలీస్ శాఖల అధికారులు సిబ్బంది నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని ఆయా శాఖలకు సంబంధించిన సేవలు అందించారు. తాండూరు పట్టణంలో ప్రతిష్ఠించిన దాదాపు 1200 పైగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నం నుంచే ప్రారంభమైంది. పలుచోట్ల వినాయక ఉత్సవ కమిటీలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాయి. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక బద్రిశ్వర చౌక్ కూడలిలో ఏర్పాటుచేసిన ఆహ్వాన వేదిక నుంచి నిమజ్జనానికి వెళుతున్న వినాయక విగ్రహాలకు ముఖ్య అతిథులు, నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. వినాయక నిమర్జన కార్యక్రమంలో తాండూర్ హిందూ ఉత్సాహ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమర్జన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తాండూర్ గంజ్ అసోసియేషన్ వారి విగ్నేశ్వరుడికి పూజ చేసి నిమర్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజలు, భక్తులు, నిర్వహకులు సమన్వయము పాటిస్తూ, హిందూ ఉత్సవ సమితి సభ్యులకు, పోలీస్, మున్సిపల్, విద్యుత్ అధికారులకు సహకరిస్తూ శాంతియుత వాతవరణంలో నిమర్జనం పూర్తి చేయాలని సూచించారు.

**తాండూర్ లో వినాయక ఉత్సవాలు ఎప్పటిలాగే ఘనంగా నిర్వహించాలి...**

హిందూ ఉత్సాహ కమిటీతో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి. గతంలో తాను రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇప్పిచ్చిన స్థలానికి ప్రహరీ గోడ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైనన్ని నిధులు అందిస్తా. మైనారిటీలు వారికి ఇచ్చిన స్థలాలను అభివృద్ధి పరిచిన మాదిరిగానే మీరు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోండి. సంప్రదాయాలను అందరూ గౌరవించాలని, ఉత్సవాలు, వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలు కాపాడుతూ భక్తి భావం పెంపొందేలా నిర్వహించుకోవాలని హిందూ కమిటీతో మహేందర్ రెడ్డి అన్నారు. తాండూర్ లో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా భద్రేశ్వర చౌక్ వద్ద వినాయక విగ్రహాలకు స్వాగతం పలికిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, హిందూ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు లక్ష్మారెడ్డి, స్వప్న పరిమళ్, నాయకులు కరణం పురుషోత్తం రావు, బాల్ రెడ్డి, నర్సింలు, గడ్డిల రవి, డాక్టర్ సంపత్, మురళి గౌడ్, బిర్కిట్ రఘు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.21 వేలకు లడ్డు కైవసం చేసుకున్న జీన్ గుర్తి శ్రీనివాస్ గౌడ్..**

తాండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వినాయక లడ్డు వేలం పాటలో తాండూర్ మండలం జీన్ గుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సినీయర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్ 21వేల రూపాయలకు లడ్డూ దక్కించుకోవడం జరిగింది.






## ముదిరాజ్ లను చిన్న చూపు చూస్తే
# గుణపాఠం తప్పదు

- **తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకట ముదిరాజ్**

**కొడంగల్, ఆగస్టు 31(ప్రజా స్వరం):**

ముదిరాజ్ లను చిన్న చూపు చూస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలకు గుణపాఠం చెబుతామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకట ముదిరాజ్ హెచ్చరించారు.వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం మాటూరు గ్రామంలో ఆదివారం ముదిరాజు పల్లె బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణలో 19 శాతం ఉన్న ముదిరాజులకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం సీట్లు కేటాయించాలని కోరారు. .ముదిరాజులతో పాటు బీసీలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు డిమాండ్ చేయడం జరిగింది . ముదిరాజులను డీ గ్రూప్ నుండి ఏ గ్రూపులోకి చేర్చేందుకు జీవో నంబర్ 15 అమలుపరచుటకై ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు.ఈ జీఓ వల్ల చదువుకున్న యువతీ, యువకులకు, 60 లక్షల మంది జనాభా ఉన్న ముదిరాజులకు జి ఓ నంబర్ 15 అమలు చేస్తే అందరికీ చదువుకున్న విద్యార్థులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం ముదిరాజ్ నాయకులు కోట్ల హనుమంతు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకట ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాబోయే రాబోయే ఎన్నికల్లో స్థానిక సంస్థ ఎన్నికల్లో ముదిరాజుల వాటా మేమంతా మాకంత జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల రాష్ట్రంలో ముదిరాజుల అధిక స్థానాలు జెడ్పిటిసిలో ఎంపీటీసీలు ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలు అధిక సంఖ్యలో కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలకు డిమాండ్ చేశారు. ముదిరాజులకు ఏ పార్టీ చిన్నచూపు చూపిన ఆ పార్టీని బొంద పెట్టడం ఖాయం అని అన్నారు.ముఖ్యంగా కొడంగల్ నియోజకవర్గం లో 80 వేల మంది ముదిరాజ్ ఓటర్లు ఉన్నందున నాలుగు జడ్పిటిసిలు, ఐదు ఎంపీపీ, ఐదు ఎంపీపీ స్థానాలు కేటాయించాలని ఈ సమావేశంలో కోరారు. ముదిరాజ్ లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం నెరవేర్చుకుంటే ముదిరాజుల సత్త ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ముదిరాజులకు న్యాయం చేయకుంటే తప్పకుండా ఆలోచన చేయవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం





**జవహర్ నగర్, ఆగస్టు 31, ( ప్రజాస్వరం ):**

జవహర్ నగర్ తూర్పు శాఖ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు ఆధ్వర్యంలో ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ నగర్ లో ఇటీవల బీహార్ లో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన తల్లి పై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలను నిరసిస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బిజెపి నాయకులు దహనం చేశారు. రాహుల్ రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ఎంత దిగజారిన రాజకీయాలు చేస్తుందో ఈ ఒక్క సంఘటనతో స్పష్టమైందని వారన్నారు ఈ కార్యక్రమంలో స్ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, రాష్ట్ర నాయకులు కిసాన్ మోచ మైపాల్ రెడ్డి,సంతోష్ గుప్తా,గిరి కత్తుల వెంకన్న, డాక్టర్ యాదగిరి, అనిల్ గుప్తా, మహేందర్, కనకరాజు, శ్రీను, అశోకు, బిక్షపతి గౌడ్, మహేశ్వరి గౌడ్, లలిత, శ్యామల, శ్రీధర్, బాలు నాయక్, మల్లికార్జున్,సోమయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్ పట్టణంలో..**

**మెదక్, ఆగస్టు 31 (ప్రజా స్వరం) :**

ఇటీవలే రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల యాత్ర ప్రధాని నరేంద్ర మోడీ తల్లి పైన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నర్సాపూర్ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ముదుచింతలపల్లి మండల కేంద్రంలో...**

**శామీర్ పేట ఆగస్టు 31(ప్రజాస్వరం) :**

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు తప్పెట్ల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు నంద్యాల శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కె.సుధాకర్ నాయక్, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు పరమేష్ గౌడ్, కార్యదర్శి హనుమంతు, జగన్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్, సుధాకర్, రవీందర్ రెడ్డి, అరుణ్, సత్యనారాయణ, ఆగమయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.





## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పర్వేక్షించిన
# కమిషనర్ జ్యోతి

**శామీర్ పేట ఆగస్టు 31(ప్రజాస్వరం) :**

తూంకుంట పురపాలక సంఘ పరిధిలోని చెరువులు శామీర్ పేట పెద్ద చెరువు, దేవరయంజాల్ చెరువు, తూంకుంట చెరువు పోతాయిపల్లి చెరువు వద్ద చేసిన ఏర్పాట్లను ఆదివారం తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ జ్యోతీ, వివిధ విభాగాల సిబ్బంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని ప్రజలందరు శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని, అన్ని చెరువుల వద్ద నిమజ్జన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు చేశారు.



## రాయారావు విశ్వేశ్వర రావుకు
# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్

**రామాయంపేట, 31 ( ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపురం గ్రామానికి చెందిన పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయారావు విశ్వేశ్వర రావుకు అరుదైన గౌరవం దక్కింది. 2019 నుండి 2025 వరకు ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహం గురించి పాటలు రాయడం మరియు కంపోజ్ చేయడం ద్వారా అద్భుతమైన ఘనత ను విశ్వేశ్వరరావు సాధించారు.ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ రికార్డ్స్, లండన్ సంస్థ వారు అతని ప్రతిభను గుర్తించి ధ్రువీకరణ పత్రం అందించారు. స్నేహితుల రోజున ప్రతిఏటా స్వీయ రచనతో పాటు స్వరకల్పన చేసి ప్రతి పాటను తగిన వీడియో చేసి రాయరావు విషు యూ ట్యూబ్ ఛానెల్ లో రిలీజ్ చేసిన ఏకైక వ్యక్తిగా ఈ రికార్డ్ ను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ ఆర్. వేణుగోపాలరావు చిత్రంలో ఉన్నారు. అయితే విశ్వేశ్వర రావు కు వండర్ బుక్ రికార్డు లో చోటు దక్కడం పట్ల ప్రముఖ సీనియర్ జర్నలిస్టు దోర్బల బాల శేఖర శర్మ, టి యు డబ్ల్యూ జే ( ఐజేయు )రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి శ్రీనివాస శర్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.






## గ్రంథాలయాన్ని పర్యవేక్షించిన
# చైర్మన్ డాక్టర్ రియాజ్

**శామీర్ పేట, ఆగస్టు 31(ప్రజాస్వరం) :**

నూతనంగా నిర్మిస్తున్న అలియాబాద్ గ్రామీణ శాఖ గ్రంథాలయాన్ని పర్యవేక్షించిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ గౌడ్, అలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మాజీ వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడ్ వీల్ యూత్ గణపతి మండపం వద్ద
# మహ అన్నదానం

**శామీర్ పేట,ఆగస్టు 31(ప్రజాశ్వరం):**

ఆలియాబాద్ మున్సిపల్ ఆలియాబాద్ కేంద్రంలోని గుడ్ విల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రభించించి అన్నదానం చేశారు.ఈ మహా అన్నదానానికి భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహా అన్నదానం ఏర్పాటు చేసి పదిమందికి ఆకలి తీర్చడంతో ఎంతో సంతృప్తి కలిగిందని అన్నారు. విగ్రహ నిర్వాహకులు పదిమంది ఆకలి తీర్చడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, బండి రాంరెడ్డి, శ్రీకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పదేళ్ల తర్వాత.. ఆ బాధ ఉండకూడదు: నాని

సోషల్ మీడియాలో ఎదురయ్యే నెగెటివిటీపై నటుడు నాని స్పందించారు. మంచి విషయం గురించి చెప్పినా విమర్శలు తప్పట్లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమంలో మాట్లాడారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో ఇది. ఓటీటీ 'జీ 5' (Zee 5)లో స్ట్రీమింగ్ అవుతోంది. తనకు నచ్చిన సినిమాకు జాతీయ అవార్డు దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ గతంలో నాని పోస్టు పెట్టగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఆ విషయాన్ని జగపతి బాబు ప్రస్తావించగా నాని స్పందించారు. ''ఒకప్పుడు మంచి, చెడు వేర్వేరు. తప్పు చేస్తే విమర్శిస్తారు, మంచి పని చేస్తే ప్రశంసిస్తారని బాల్యంలో నేర్చుకున్నాం. కానీ, ఇప్పుడు మంచైనా, చెడైనా ట్రోల్స్ వస్తున్నాయి. ఏదైనా విషయాన్ని నేరుగా చెప్పినా, ఎంత స్మార్ట్‌గా చెప్పినా విమర్శలు తప్పట్లేదు. మీరు పెట్టిన పోస్టుని అర్థం చేసుకున్న వారికన్నా అపార్థం చేసుకునే వారే ఎక్కువగా ఉంటున్నారు. 'నా ఉద్దేశం అది కాదు' అంటూ అందరికీ వివరణ ఇవ్వలేం కదా. అలాగని మనసులో మాట బయట పెట్టకుండా కూడా ఉండలేం. 'ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు.. ఒకవేళ సోషల్ మీడియాలో పోస్టు పెడితే ఎవరేమనుకుంటారో' అని ఆలోచిస్తూ ఉండిపోవడం నరకమైపోతోంది. కామెంట్లను పట్టించుకోకపోవడమే మనం చేయగలిగింది. మనకు కరెక్ట్ అనిపించింది మనం చేయాలి. 'ఆరోజు నేను మాట్లాడి ఉండాల్సింది. మాట్లాడలేకపోయా' అనే బాధ పదేళ్ల తర్వాత ఉండకూడదు'' అని పేర్కొన్నారు. ఒకే రోజు విడుదలయ్యే సినిమాల గురించి మాట్లాడుతూ.. ''మావాడి సినిమా ఆడాలి. వేరే వాడిది ఆడకూడదు' అని అభిమానులు, 'మన సినిమా హిట్ కావాలి. మరో సినిమా హిట్ కాకూడదు' అని ఇండస్ట్రీ వాళ్లు అంటుంటారు. నేను నా సినిమాలతోపాటు విడుదలయ్యే చిత్రాలూ విజయం అందుకోవాలని కోరుకుంటా. అందరూ బాగుంటేనే మనం బాగుంటాం'' అని పేర్కొన్నారు. 2023లో ప్రకటించిన జాతీయ అవార్డుల జాబితాలో 'జై భీమ్' సినిమా లేకపోవడంతో 'బ్రోకెన్ హార్ట్' ఎమోజీని పోస్టు చేశారు నాని. టాలీవుడ్‌కు వచ్చిన అవార్డుల గురించి ప్రస్తావించకుండా కోలీవుడ్ మూవీ గురించి పోస్టు పెట్టడంతో అప్పట్లో విమర్శలొచ్చాయి. 'జయమ్ము నిశ్చయమ్మురా'లో ఇప్పటికే నాగార్జున, శ్రీలీల సందడి చేశారు.

# 'రేసింగ్'కు వెళ్లి.. ప్రేమలో పడి.. పెళ్లిపై స్పందించిన నివేదా



కాబోయేవాడితో కలిసి దిగిన ఫొటోలను ఇటీవల సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ.. సర్‌ప్రైజ్ చేసింది నటి నివేదా పేతురాజ్. ఆ స్టిల్స్ చూసిన అభిమానులు, పలువురు నెటిజన్లు ఆమెకు నిశ్చితార్థం అయిపోయిందని అనుకున్నారు. తాము ఇంకా ఎంగేజ్‌మెంట్ చేసుకోలేదని లేటెస్ట్ ఇంటర్వ్యూలో నటి స్పష్టత ఇచ్చింది. అక్టోబరులో నిశ్చితార్థం, వచ్చే ఏడాది జనవరిలో వివాహం చేసుకోబోతున్నామని తెలిపింది. తేదీలు ఖరారు కాలేదని చెప్పింది. సింపుల్‌గానే ఆ రెండు వేడుకలనూ ప్లాన్ చేస్తున్నట్టు తెలిపింది.

**మా మేనేజరుకూ తెలియదు : నివేదా**

''దుబాయ్‌లో ఐదేళ్ల క్రితం జరిగిన ఫార్ములా ఈ రేసింగ్‌లో రాజ్‌హిత్ ఇబ్రాన్‌తో నాకు పరిచయం ఏర్పడింది. తర్వాత స్నేహితులమయ్యాం. 'మన బంధాన్ని పెళ్లి వరకూ ఎందుకు తీసుకెళ్లకూడదు?' అని ఇటీవల ఒకరికొకరు ప్రశ్నించుకుని, పెళ్లికి సిద్ధమయ్యాం. మా ప్రేమ సంగతి నాకు బాగా కావాల్సిన వారికి మాత్రమే తెలుసు. చిత్ర పరిశ్రమలో ఎవరికీ చెప్పలేదు. అందుకే కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారిలో మా మేనేజరు కూడా ఒకరు'' అని పేర్కొంది. తనకు కాబోయే భర్త సినిమాలు ఎక్కువగా చూస్తారని, కెరీర్ పరంగా తనకు సపోర్ట్‌గా చేస్తుంటారని చెప్పింది. క్రీడలపైనా నివేదాకు ఆసక్తి ఎక్కువ. రేసింగ్, బ్యాడ్మింటన్‌లో ఆమెకు ప్రావీణ్యం ఉంది. 'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా', 'అల వైకుంఠపురములో' తదితర చిత్రాల్లోని కీలక పాత్రలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. భారతీయుడైన రాజ్‌హిత్ దుబాయ్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

# సక్సెస్ అంటే డబ్బు, పేరు కాదు..



రకుల్ ప్రీత్ సింగ్.. పేరు వినగానే, హీరోయిన్‌గానే కాకుండా ఫిట్‌నెస్ అండ్ హెల్త్ గుర్తొస్తుంది. ఆమె గురించి తెలుసుకోవాలంటే ఎప్పటికప్పుడు కొత్త విషయాలు ఉంటూనే ఉంటాయి. నటిగానే కాకుండా ఆమె ఫిట్‌నెస్, డ్యాన్స్, స్పోర్ట్స్, సోషల్ యాక్టివిటీస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో తనకంటూ ప్రత్యేకతను ఏర్పరచుకుంది. రకుల్ గురించి ఇంకొన్ని విషయాలు...

**నాన్న ఆర్మీ ఆఫీసర్**

రకుల్ ప్రీత్ సింగ్ న్యూఢిల్లీలోని సిక్కు కుటుంబంలో పుట్టింది. ఆమె తండ్రి కుల్వీందర్ సింగ్ ఆర్మీ ఆఫీసర్‌గా పని చేసేవారు. దాంతో ఆమె ఆర్మీ స్కూల్‌లోనే స్కూలింగ్ చేసి, ఆపైన జీసస్ అండ్ మేరీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. రకుల్ ప్రీత్ జాతీయ స్థాయి గోల్ఫ్ ప్లేయర్. అంతేకాదు, ఎంతో ఆసక్తితో భరతనాట్యం కూడా నేర్చుకుంది. అలాగే ఆమెకు గుర్రపు స్వారీ చేయడం కూడా చాలా ఇష్టం.

**మోడలింగ్**

మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాక, రకుల్ 18 ఏళ్లకే కన్నడ సినిమా 'గిల్లి' ద్వారా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో నటించి.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది. 'ఫెమినా' మిస్ ఇండియా–2011లో రకుల్ ఐదో స్థానంలో నిలిచింది. అందులోనే పాంటలూన్స్ మిస్ ఫ్రెష్ ఫేస్, ఫెమినా మిస్ టాలెంటెడ్, మిస్ బ్యూటిఫుల్ స్మైల్, మిస్ బ్యూటిఫుల్ ఐస్, పీపుల్స్ చాయిస్ మిస్ ఇండియా టైమ్స్ వంటి టైటిల్స్ గెలుచుకుంది.

**కోవిడ్ టైంలో..**

'మనకంటూ ప్రత్యేకంగా టైమ్ కేటాయించుకోవాలి. ఎవరి సంతోషం వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. దానికోసం ఎవరిపైనా ఆధారపడొద్దు' అన్నది రకుల్ అభిప్రాయం. రకుల్ తన సామాజిక బాధ్యతను ఎప్పుడూ మరిచిపోలేదు. కోవిడ్ సమయంలో వంద కుటుంబాలను ఆదుకోవడమే కాకుండా, క్రౌడ్ ఫండింగ్ చేసి పేదలకు డొనేషన్స్ అందించింది. 2017లో రకుల్ 'తెలంగాణ బేటీ బచావో, బేటీ పఢావో' ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా అపాయింట్ అయింది.

**నాన్న నుంచే వచ్చాయి..**

2024లో తను ప్రేమించిన జాక్కీ భగ్నానీని గోవాలో వివాహం చేసుకుంది. మొదట ఓవర్సీస్‌లో పెళ్లి వేడుకలు జరపాలనుకున్నారట! కాని, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలనే ఆలోచనతో గోవాలోనే ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. 'సక్సెస్ అంటే పేరు, డబ్బు కాదు. మనసుకు నచ్చిన పని చేస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపడం. చిన్నప్పటి నుంచి నాన్న నుంచి వచ్చిన డిసిప్లిన్, పంక్చువాలిటీ నన్ను ఎప్పటికీ హ్యాపీ లైఫ్ వైపే తీసుకెళ్లాయి. ఇష్టం దానివల్లే చేయాల్సిన పనిలో రెండు నిమిషాలు ఆలస్యమైనా నాకు ప్యానిక్ అటాక్ వచ్చేస్తుంది. సోషల్ ఎంటర్‌టైనర్స్ చేయడం నాకు చాలా ఇష్టం. వాటితో సమానంగా సోషల్ రెస్పాన్సిబుల్ సినిమాలూ చేయాలని ఉంది. ఫ్యాషన్, డ్రెస్సింగ్ విషయానికొస్తే, నాకు ఏది కంఫర్ట్ ఉంటే అదే ఎంచుకుంటాను' అని చెబుతుంది

## అబ్దుల్ కలాం బయోపిక్..
# ధనుష్‌పై ఓంరౌత్ ప్రశంసలు



మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఎ.పి.జె. అబ్దుల్ కలాం జీవితాధారంగా 'కలాం' సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ధనుష్ టైటిల్ పాత్ర పోషించనున్నారు. ఓంరౌత్ దర్శకత్వం వహించనున్నారు. వేసవిలో జరిగిన 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'లో ఈ చిత్రాన్ని ప్రకటించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ ఓంరౌత్ మాట్లాడుతూ.. కలాం బయోపిక్ కోసం ధనుష్ కన్నా బెటర్ యాక్టర్ తనకు దొరకరేమోనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ధనుష్ అంగీకారం తెలపడం ఆనందంగా ఉందన్నారు. ఆయనతో వర్క్ చేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కలాం రాసిన పుస్తకాలు తన జీవితాన్ని మార్చాయని ఓంరౌత్ పేర్కొన్నారు. ఇతర సినిమాలతో పోలిస్తే బయోపిక్స్ తెరకెక్కించడం సవాలన్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. బయోపిక్‌తోనే దర్శకుడిగా ఓంరౌత్ కెరీర్ మొదలైంది. ఆయన తెరకెక్కించిన తొలి సినిమా 'లోకమాన్య: ఏక్ యుగ్‌పురుష్'. బాలగంగాధర్ తిలక్ జీవితాధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆ తర్వాత 'తానాజీ', 'ఆదిపురుష్' తెరకెక్కించారాయన. ఇటీవల విడుదలైన 'కుబేర'తో ప్రేక్షకులను పలకరించిన ధనుష్.. స్వీయ దర్శకత్వంలో 'ఇడ్లీ కడై'లో నటిస్తున్నారు. ఈ మూవీ అక్టోబరులో రిలీజ్ కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999